www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 10 సెప్టెంబర్ 2024

రిజర్వ్ ఫారెస్ట్‌లోనే చిరుత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చిరుతపులి నగరంలోని దివాన్‌చెరువు రిజర్వ్ అటవీప్రాంతంలో ఉన్నట్లు ట్రాప్ కెమెరాల్లో గుర్తించామని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. అలాగే రిజర్వ్ అటవీప్రాంతంలో చిరుతపులి పాదముద్రలను గుర్తించామన్నారు. దీన్ని వల్ల ఇప్పటి వరకూ అటవీ, బయట ప్రాంతాల్లో మనుషులకు, పశువులకు ఎటువంటి హాని జరగలేదని తెలిపారు. చిరుత కోసం బోనులు ఏర్పాటు చేశామన్నారు. చిరుత సంచారాన్ని బట్టి ట్రాప్ కెమెరాలను మార్పు చేశామన్నారు.

ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

ఇటు వాన.. అటు వరద

వంతెనపై నుంచి ప్రవహిస్తున్న ఏలేరు వరద

వానలు వరదలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను ఊపిరాడనీయడం లేదు. నిన్నటి వరకూ గోదావరి వరదతో ఉరకలేయగా ఇప్పుడు ఏలేరు కాలువ వంతు అయ్యింది. మరోపక్క పంపా, తాండవ రిజర్వాయర్లు సైతం వరదనీటితో నిండిపోయాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ప్రాణాలు గుప్పిటపట్టుకుని జీవిస్తున్నారు.

- ఉధృతంగా ఏలేరు కాలువ, రాజుపాలెం వద్ద గండి
- గొల్లప్రోలును ముంచెత్తిన వరద
- ప్రమాదస్థాయికి తాండవ, పంపా నీటిమట్టాలు
- గోకవరంలో ఇసుకపల్లి చెరువుకు గండి
- కోరుకొండలో పోటెత్తిన బురదకాలువ, ముంపులో శ్రీరంగపట్నం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఏలేరు, సుద్ధగడ్డ కాలువల ఉధృతికి గొల్లప్రోలు శివారు ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యాయి. జగనన్నకాలనీ, ఎసిసి కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. జగనన్న కాలనీకి రాకపోకలు సైతం స్తంభించాయి. అక్కడ ప్రజలు పడవలపై ప్రయాణించాల్సిన పరిస్థితి. వరదకారణంగా జగనన్నకాలనీలో 700 వరకూ కుటుంబాలు, ఎస్‌సికాలనీ, ఇతర ప్రాంతాల్లో వేయికిపైగా కుటుంబాలు ముంపుబారిన పడ్డాయి. యు.కొత్తపల్లి మండలం నాగులపల్లి వైపుగా వరద నీరు రావడంతో పంచాయితీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ జిల్లా అధికారులతో అక్కడకు చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు.

రాజుపాలెంలో ఏలేరు కాలువకు గండి

ఏలేరు రిజర్వాయర్‌కు రికార్డుస్థాయిలో వరదనీరు వచ్చి చేరుతుండటంతో దిగువకు 25వేల క్యూసెక్కులను విడిచిపెట్టారు. దీంత ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ ప్రవాహానికి కిర్లంపూడి మండలం రాజుపాలెంలో గండి పడింది. 300 ఎకరాలను ఏలేరు వరదనీరు ముంచెత్తింది. దిగువకు మరింత నీరును విడుదల చేసే అవకాశం ఉండటంతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. గండిపూడిక పనులను అధికారులు చేపట్టారు. ఏలేశ్వరం మండలం అప్పనపాలెం వంతెనపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. రాజుపాలెంలో ముంపుప్రాంతాలను సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో బృందం పరిశీలించింది. బాధితులతో మాట్లడింది..

ముంపు ప్రాంతాల్లో పవన్‌కళ్యాణ్ పర్యటన

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం గొల్లప్రోలులో ముంపునకు గురైన జగనన్నకాలనీలో పర్యటించారు. అధికారులు, ఎంఎల్ఎలతో కలిసి ఆయన పడవపై అక్కడికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నామన్నారు. ఇప్పటికే ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. గత ప్రభుత్వం పల్లపు ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసి పేదలకు ఇచ్చిందన్నారు. ఫలితంగా నేడు ముంపునకు గురయ్యారన్నారు. ఆయన వెంట కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజ, ఎంఎల్‌ఎ పంతం నానాజీ, మాజీ ఎంఎల్‌ఎ వర్మ, జనసేన నాయకులు, ఇతర అధికారులు ఉన్నారు.

ముంచెత్తిన బురదకాలువ

కోరుకొండ మండలంలో శ్రీరంగపట్నాన్ని బురదకాలువ ముంచెత్తింది. కాలువకు గండి పడటంతో శ్రీరంగపట్నం గ్రామం ముంపునకు గురైంది. అక్కడి ప్రజలను స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. వీరిని ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ పరామర్శించారు. బాధితులతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆరాతీశారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అలాగే కలెక్టర్ ప్రశాంతి, జెసి చిన్నరాముడు పునరావాసకేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా బాధితులకు భోజనాన్ని వడ్డించారు. వారి వెంట ఆర్‌డిఒ శివజ్యోతి, తహశీల్దార్ సుస్వాగతం ఉన్నారు.

అధికారుల పర్యటన

రౌతులపూడి : ఏలేరు వరద ప్రవామానికి గరయ్యే బంగారయ్యపేట, శంగవరం, బలరామపురం గ్రామాల్లో తహశీల్దార్ పివివి.సత్యనారాయణ, ఎంపిడిఒ ప్రేమ్‌సాగర్ బృందం పర్యటించింది. ఆయా గ్రామాల్లో ఏలేరు గట్ల పటిష్టతపై ఆరా తీశారు. గండి పడే పరిస్థితులు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు.

శంఖవరం : మండలం పరిధిలోగల పెద బాపన్న దొర చెరువు, ఏలేశ్వరం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌లను ప్రత్యేకాధికారి, జిల్లా ఆడిటింగ్ అధికారి వై.సురేష్‌బాబు, తహశీల్దార్ పోతురాజు, ఎంపిడిఒ శివరామకృష్ణయ్య పరిశీలించారు. జి.కొత్తపల్లి వద్ద ఏలేశ్వరం లెఫ్ట్ ప్రధాన కాలువ బలహీనంగా ఉన్నట్లు గుర్తించి ఇసుక బస్తాలు వేయించి పటిష్టపరిచినట్లు అధికారులు తెలిపారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం వద్ద వైఆర్‌సి కాలువకు పడిన గండిని పూడ్చే నిమిత్తం 6 మెట్రిక్ టన్నుల సర్వేబాజులు పంపించినట్లు తెలిపారు.

రాజుపాలెంలోకి చేరిన వరదనీరు

బాధితులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ

పంటలకు పొంచి ఉన్న ప్రమాదం

సామర్లకోట : ఏలేరు జలాలు విడుదలతో వికె.రాయపురం, బోయినపూడి, సత్యవరపుపేట గ్రామాల్లోని పంటలకు ప్రమాదం పొంచివుంది. వికె.రాయపురం వద్ద ఏటిగట్టు కోతకు గురైంది. జెసి రాహుల్‌మీనా ఆధ్వర్యంలో అధికారులు కోతకు గురియైన ఏటిగట్టు వద్ద రక్షణ చర్యలు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ఈ గట్టును సోమవారం పరిశీలించారు. ఎంఎల్‌ఎ తనయుడు రంగనాగ్, సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి ఇఇపిఆర్‌డి కర్రి హరికృష్ణస్వత్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడ్కో గృహాలను, పెద్ద యేరును ఆర్‌డిఒ కిషోర్ పరిశీలించారు. స్థానికంగా పునరావాస కేంద్రాలకు అనువైన సదుపాయాలు ఎక్కడ ఉన్నాయనే అంశంపై ఆరా తీశారు.

ఏలేరుకు రికార్డు స్థాయిలో వరద

ఏలేశ్వరం : ఏలేరు రిజర్వాయర్‌కి రికార్డు స్థాయిలో వరదనీరు వచ్చి చేరుతుంది. జడేరు, మడేరు వాగులు పొంగిపొర్లడంతో 46,195 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో అధికారులు 25000 క్యూసెక్కుల నీటిని ఏలేరు కాలువ ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ఏలేరు పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీటి ప్రవాహం సాగుతోంది. ఎర్రవరంలో పలు ప్రాంతాలు జలమయం కావడంతో జడ్‌పి సిఇఒ శ్రీరామచంద్రమూర్తి, తహశీల్దార్ ఆర్.వెంకటేశ్వరరావు, ఎంపిపి గొల్లపల్లి బుజ్జి పరిశీలించారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక బ్రిడ్జి

పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో ఏలేరు దఖ్ఖాలువపై నిర్మించిన తాత్కాలిక బ్రిడ్జి సోమవారం తెల్లవారుజామున కొట్టుకుపోయింది. 2022లో ఈ బ్రిడ్జి కూలిపోవడంతో దీని తాత్కాలిక బ్రిడ్జిని నిర్మించారు. దీంతో మూడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వరద పోటెత్తడంతో 400 ఎకరాల్లో వరి పంట మునిగిపోయింది. దీంతో జెసి రాహుల్‌మీనా, ఆర్‌డిఒ జె.సతారామారావు, తహశీల్దార్ వెంకటలక్ష్మి దళ్ళు కలవ పరిసరాలను పరిశీలించారు. వడ్లమూరు - జి రాగంపేట వంతెన వద్ద వడ్లమూరు వైపు గండి పడటంతో అధికార యంత్రాంగమంతా అప్రమత్తమయ్యారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గండిని పూడ్చివేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నిలిచిపోయిన రాకపోకలు

కోటనందూరు : తాండవ, ఎదురుగడ్డ వాగు పొంగడంతో నర్సీపట్నం, తుని మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాకరాపల్లి సమీపంలో బ్రిడ్జి పై నుంచి వాగునీరు ప్రవహించడంతో 20 గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచాయి. కోటనందూరు, నాతవరం మండలాల మధ్య తాండవ ఏరుపై ఉన్న వంతెనపై నుంచి 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తుని రూరల్ సిఐ చెన్నకేశవరావు, కోటనందూరు ఎస్ఐ టి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అల్లిపూడి, కోటనందూరు గ్రామాల్లో ఎస్‌సి కాలనీలు, తునిలో రెల్లి కాలనీల్లోకి వరద నీరు చేరింది. పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంఎల్‌ఎ యనమల దివ్య అధికారులను ఆదేశించారు. తొండంగి మండలంలో ముంపునకు గురైన గ్రామాల్లో వైసిపి నాయకుడు యనమల కృష్ణుడు, ఎంపిపి విజయబాబు, నాయకులు పర్యటించారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

సమనసలోని బాలుర గురుకుల పాఠశాలను సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సందర్శించారు. పాఠశాల్లోని విద్యార్థులు చదువుకునే తరగతి గదులు, నిద్రించే గదులు, మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి ప్లాంట్లు తదితరాలను పాఠశాల ఆవరణలో ఆయన పరిశీలించారు. పాఠశాల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, ఏప ప్రాంతాల నుంచి వచ్చి గురుకుల పాఠశాల్లో చదువుకుంటున్నారు, సమయానికి సిలబస్ పూర్తి చేస్తున్నారా అని పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైటిఎస్. రాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోని డిజిటల్ క్లాస్ బోర్డ్‌ను పరిశీలించి విద్యార్థులను సిలబస్ ఎంతవరకు అయిందని ప్రశ్నించారు. గురుకుల పాఠశాలలో సిబిఎస్ఇ అమలు చేస్తున్న నేపథ్యంలో పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో చక్కని పారిశుధ్యం నిర్వహించి విద్యార్థులు రోగాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైటి ఎస్.రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమనస గురుకుల పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి వినతి

రామచంద్రపురం: ద్రాక్షారామ గ్రామపంచాయతీకి డంపింగ్ యార్డ్ లేక చెత్త సమస్య తీవ్రతమవుతోందని దీనిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్. మహేష్‌కు ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ సోమవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో మార్కెట్ ఆక్రమణకు గురైందని ఆక్రమణ తొలగించి, అభివృద్ధి కి కృషి చేయాల న్నారు. ద్రాక్షారామలో సమస్యలను పరిష్క రించాలని కలెక్టర్ ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రాంబాబు పాల్గొన్నా రు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గర్భిణులు ప్రతి నిత్యం పౌష్టికాహారం తీసుకుని వైద్య సలహాలు పాటించడం ద్వారా పుట్టబోయే బిడ్డ, తల్లి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ పిఎన్ఎస్‌డి.రత్నకుమారి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమ వారం అంగర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు రత్నకుమారి ఆధ్వర్యంలో 24 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి కె.రమా దేవి, స్టాఫ్ నర్స్ జి.నవ్య, లాబ్ టెక్నీషియన్ ఆలీ, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు నీరు మళ్లించేందుకు చర్యలు

ప్రజాశక్తి-మామిడికుదురు

భారీ వర్షాలకు పాశర్ల పూడి బాడవ సత్తరువు తోటకాలనీ లో ముంపు నీరు నిలిచిపోయింది. దీంతో ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ లు సోమవారం జెసిబి సాయంతో ముంపు నీరు మళ్లించే చర్యలు చేపట్టా రు. డ్రెయిన్ తవ్వి నిలిచిన ముంపు నీటిని బయటకు మళ్ళించే చర్యలు చేపట్టామని సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి తెలిపారు. వర్షాకాలంలో కాలనీ మునిగి పోయి అవస్థలు పడుతు న్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు.ఉన్నతాధికారుల శాశ్వత డ్రైనేజీ నిర్మించాలని విన్నవించారు.

గొడౌన్ ఆధునికీకరణకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

శిథిలావస్థలో ఉన్న మార్కెట్ యార్డు గొడౌన్ లను ఆధునీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలో స్థానిక బళ్ల గేటు సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన మార్కెట్ యార్డ్ గొడౌన్‌ను సోమవారం ఎంఎల్ఎ సుబ్బరాజు పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న గొడౌన్ ఆధునికీకరణకు అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే వర్షాలకు ముంపునకు గురవుతున్న ప్రాచీన బ్రిటిష్ కట్టడాలైన తహశీల్దార్, పోలీస్ భవనాల నూతన భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద గుత్తుల సాయి, గోలకోటి దొరబాబు, చెల్లి అశోక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గొడౌన్ పరిశీలిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

విఆర్‌లో రామచంద్రపురం ఎస్ఐ?

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం ఎస్ఐ పాటి వాసు విధుల్లో చేరి 10 రోజులు కాకముందే ప్రభుత్వం విఆర్‌కి పంపించినట్లు సమాచారం. గతంలో చంద్రబాబుని అనపర్తికి వెళ్లకుండా అడ్డుకున్న ఎస్ఐ వాసు ఇటీవల స్థానిక రాజకీయ నాయకుల అండతో రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చంద్రబాబు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా పోలీసులను కూర్చోబెట్టిన అప్పటి బిక్కవోలు ఎస్ఐ వాసు ఇక్కడ నియమించడమేమిటిని దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశార. అలాంటి వ్యక్తికి పోస్టింగ్ ఇవ్వడంపై అనపర్తి ఎంఎల్ఎ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై ఫోన్ లో మంత్రి వాసంశెట్టి సుభాష్ తో మాట్లాడి అభ్యంతరం వ్యక్తం చేశారు. వైసిపి నేతల ఆదేశాలతో చంద్రబాబును, అప్పట్లో తనను ఇబ్బంది పెట్టిన వాసుకు మంత్రి తన నియోజకవర్గంలో పోస్టింగ్ వేయించుకోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. రాజకీయ పెద్దలకుఈ విషయం చేరవేయడంతో ఎస్ఐ వాసును విఆర్ పంపించారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యార్థులు ఇష్టంతో చదివి, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటి చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ మరియు ఠానేలంక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్ లోనూ జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీల్లో కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తో పాటు హాస్టల్ అధికారిణి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి-యంత్రాంగం

విజయవాడ వరద బాధితుల కోసం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పలువురు నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. వీటిని వాహనాల్లో సోమవారం విజయవాడ తరలించారు. ప్రజాప్రతి నిధులు వరద ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించారు.

సహాయక చర్యల పర్యవేక్షణ

మామిడికుదురు: విజయవాడ లోని 46వ డివిజన్ చిట్టి నగర్ వరద బాధిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం చేపట్టబోయే పనులను పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ దగ్గర ఉండి పర్యవేక్షించారు. మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను జెసిబి సాయంతో తొలగించే పనులను సోమవారం అధికారులు చేపట్టారు. పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు.

'బట్టీ' యూనియన్ రూ.50 వేల సాయం

ఆలమూరు: విజయవాడ వరద బాధితులకోసం మండలంలోని చొప్పెల్ల బట్టీ యూనియన్ ఆధ్వర్యంలో 3 టన్నుల కూరగాయలను రూ.50 వేలతో కొనుగోలు చేశారు. వీటిని ప్రత్యేక వాహనంపై కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యనందరావు ద్వారా విజయవాడ పంపిం చారు. దానికి సంబంధించిన రూ. 50 వేల మొత్తాన్ని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సకుమల్ల రాముడు, తోరాటి రాంబాబులు కలసి టిడిపి గ్రామ అధ్యక్షుడు దొండపాటి సుబ్బరాజు సమక్షంలో మడికి కూరగాయలు మార్కెట్ ప్రెసిడెంట్ పాలూరి సత్తిబాబుకు సోమవారం అందజేశారు. సుబ్బరాజు మాట్లాడుతూ బాధితులకు సాయం కోసం చొప్పెల్ల బట్టి యూనియన్‌తో పాటుగా, చొప్పెల్లకు చెందిన ఉల్లి మార్కెట్ వ్యాపారులు విరాళంగా కొన్ని ఉల్లి బస్తాలను అందజేశారు. వీటిని కూడా కూరగాయలతో పాటుగా పంపించామన్నారు.

సత్తిబాబుకు నగదు అందజేస్తున్న యూనియన్ నేతలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

భారీ వర్షాలు, గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ నాతి బుజ్జి, తహశీల్దార్, టి.రాజేశ్వరరావు అన్నారు. సోమవారం మండల స్థాయి అధికారులతో గోదావరి నదికి ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తున్నందున అధికారి యంత్రాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక గ్రామీణ ప్రాంతాల్లో అధిక వర్షాల వల్ల వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు : జెసి

ప్రజాశక్తి-అమలాపురం

అర్జీల సత్వర పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని జెసి టి.నిషాంతి ఆదేశించారు సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులతో జెసి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకోని అర్జీలు స్వీకరించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుమారుగా 115 అర్జీలను జిల్లా జెసి టి.నిషాంతి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్, జిల్లా నీటి యజ మాన్య సంస్థ పీడీ వి.మధుసూదన్ తదితరులు స్వీకరించారు. అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జెసి టి.నిషాంతి

నల్లూరులో శిలాఫలకం ధ్వంసం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

నల్లూరులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకం ధ్వంసం చేశారు. గ్రామ శివారులోని మురుగు కాలవ వంతెన సమీపంలో గత వైసిపి ప్రభుత్వం హయాంలో అంగర, టేకి ఆర్అండ్‌బి రహదారి నుంచి నల్లూరు మీదుగా కాలేరు, వెదురుమూడి ఆర్అండ్‌బి రోడ్డు వరకు నాబార్డ్ నిధులు రూ.83.10 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2024 మార్చిలో శంకుస్థాపన చేశారు. కాగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసంచేశారు.

ధ్వంసమైన శిలాఫలకం

కార్టూ'నిజం'



ఘనంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిటిఆర్ నగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. నరసింహారావుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి పలువురు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గొల కోటి దొరబాబు, చెల్లి అశోక్, గుద్దటి జమ్మి, దొమ్మేటి రమణ కుమార్, పిల్లి నాగరాజు, చిక్కాల అంజిబాబు, మెండి కమల తదితరులు పాల్గొన్నారు.

నరసింహారావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్న మెండి కమల తదితరులు

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర టిడిపి తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ

ప్రజాశక్తి-రావులపాలెం

అంగన్‌వాడీ కేంద్రాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ అన్నారు. సోమవారం మండలపరిధి గోపాలపురం సూపర్ వైజర్ ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కొత్తపేట సిడిపిఒ పి.శారద పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆకుల రామకష్ణ మాట్లాడుతూ ఎన్‌డియే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను మరింతగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారన్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు గత టిడిపి ప్రభుత్వం పక్కా భవనాలు కట్టించిందని, అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు అధికమొత్తంలో పెంచిందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన చోట భవనాలు నిర్మించటానికి ఎన్‌డియే కూటమి సిద్ధంగా ఉందన్నారు. అనంతరం సిడిపిఒ శారద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు అధిక పోషకాలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరు ధాన్యాలు తీసుకోవాలని కొన్ని సలహాలు సూచన లిచ్చారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా సీమంత వేడుకలు, అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డియే నాయకులు మైగాపుల గురవయ్య నాయుడు, అధికారి నాగేశ్వరరావు, ఓదూరి శివ, సూపర్ వైజర్ నాగ సత్యవేణి, కార్యదర్శి అన్వర్, ఎఎన్ఎమ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిర, స్వర్ణలత, భూలక్ష్మి, ఝాన్సీ రాణి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఆకుల రామకృష్ణ

నేరాలు ఘోరాలు

వేటకు వెళ్లిన మత్స్యకారుని మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు గోపి చిట్టిబాబు(53) సోమవారం వేటకి వెళ్లి మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున వేటకు వెళ్లిన చిట్టిబాబు మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా స్థానిక తుల్య భాగ డ్రెయిన్‌లో మృతదేహం కనిపించిందని కుటుంబ సభ్యులు తెలిపినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిందితునికి తొమ్మిదేళ్ల జైలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని జె.అన్నవరం గ్రామంలో 2016లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో నిందితునికి రాజమహేంద్రవరం 8వ డిస్ట్రిక్ట్ సెషన్ కోర్ట్ తొమ్మిదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ ఎన్.రామలింగేశ్వర తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులకు ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వివరించారు. జె.అన్నవరం గ్రామంలో 2016 జూలై 15న ఏకాదశి కావడంతో మైనర్ బాలిక హారతి నిమిత్తం తోట మణికంఠ ఇంటికి వెళ్లింది. తిరిగి వస్తుండగా మణికంఠ సాయంతో పెయ్యల వీరబాబు బాలికను నోరు నొక్కి మరో గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ సంఘటనపై అప్పటి ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారిశెట్టి వెంకటేశ్వరరావు బాధితురాలు తరపున వాదించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వై.బెన్నయ్య నాయుడు నిందితుడు పెయ్యల వీరబాబుకు 9 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5000 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు.

ఆటో ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పటవల పంచాయతీ మట్లపాలెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోకి కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి ఆటో తిరగబడింది. కాకినాడ జగన్నాథపురం చెందిన వై.మాణిక్యాలరావు, వీర యానంకు చెందిన కృష్ణవేణి, మట్లపాలెంకు చెందిన వి.జ్యోతి, ఉప్పలంకకు చెందిన సత్యవేణి గాయాలపాలయ్యారు. స్థానికులు, కోరంగి పోలీసులు 108 లో కాకినాడ తరలించారు.

కాపాడిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి-ఆలమూరు

మానసిక స్థితి సరిగా లేనందున ఆత్మహత్యయత్నానికి పాల్పడుతున్న ఒక వ్యక్తిని పోలీసులు రక్షించారు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం జొన్నాడ, రావులపాలెం గౌతమి గోదావరి వంతెన వద్దకు కడియం మండలం పొట్టిలంకకు చెందిన పెద్దిరెడ్డి మణికుమార్ (28) చేరుకున్నాడు. అయితే మణికుమార్ కు మానసిక స్థితి సరిగా లేనందున గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. ఈ ఉద్దేశంతో గోదావరి వంతెనపై కాలినడకన సంచరిస్తున్నాడు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ హైవే పోలీస్ సిబ్బందికి సమాచారం అందించారు. స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నెహ్రూ, హైవే పోలీసులు వెన్నేటి సాయికుమార్, జివిఎస్ఎన్.మూర్తి కలిసి పరిసర ప్రాంతాలను గాలించగా ఆత్మహత్యకు యత్నిస్తున్న వ్యక్తిని గమనించి వెంటనే స్పందించి అడ్డుకున్నారు. అలాగే పోలీసులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సిఐ విద్యాసాగర్‌కు, ఆలమూరు పోలీసులకు కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు.

రఘుదేవపురంలో చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం గ్రామంలో యనమదల వీరన్న చౌదరి ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సెప్టెంబర్ 5న వీరన్న చౌదరి కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి రాగా తలుపులకు వేసిన తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. అనుమానంతో ఇంటిలో ఉన్న వస్తువులను పరిశీలించగా 7 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.70 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే సీతానగరం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

2,790 కేజీల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

కడియపులంకలో రాజమండ్రి విజిలెన్స్ , ఎన్ఫోర్స్మెంట్ అధికారులు జరిపిన దాడుల్లో 2,790 పిడిఎస్ బియ్యంతో పాటు టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని రీజనల్ విజిలెన్స్ ఎస్పి కె.ఎస్ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం కడియపులంకలో తనిఖీలు చేయగా టాటా ఏస్ వాహనంలో పిడిఎస్ బియ్యాన్ని డ్రైవర్ దేవగుప్త కాళీ కృష్ణ భగవాన్ ఎగుమతి చేస్తుండగా పట్టుకున్నారు. 57 సంచుల్లో సుమారు 2,790 కేజీల పిడిఎస్ బియ్యంను గుర్తించినట్లు తెలిపారు. కడియపులంకకు చెందిన పెన్నాడ రాంబాబు బియ్యంను కడియం పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి మండపేట ప్రాంతాలలోని కోళ్ళ ఫామ్‌లకు అమ్ముచున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ 3,34,340లు ఉన్నట్లు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చిత్తడిగా ప్రభుత్వాసుపత్రి రహదారి

బురదతో ఆసుపత్రికి వెళ్లే రహదారి

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి నుంచి సింగంపాలెం వెళ్లే రహదారి చిత్తడిగా మారింది. ఆ మార్గంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రోగులు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, వికలాంగులు పరిస్థితి దారుణంగా ఉంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో రహదారిలో గోతులు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రోడ్డు నల్లరేగడితో ఉండటంతో పలువురు జారి పోతున్నారు. ముఖ్యంగా గర్భిణులు ఈ రహదారిలో వెళ్లాలంటే ఎటువంటి ప్రమాదాన్ని చవిచూడాల్సివస్తుందో అన్ని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తాత్కాలికంగానైనా మరమ్మతుల పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అవార్డు గ్రహీత నాగేశ్వరరావును సత్కరిస్తున్న స్థానిక పెద్దలు

ఘంటసాల అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - సామర్లకోట

ఘంటసాల అవార్డు గ్రహీత చిప్పాడ నాగేశ్వరరావును సామర్లకోట స్టేషన్ సెంటర్ నూకాలమ్మ ఆలయంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం రాత్రి ఆలయంలో ఘంటసాల పాటల కచేరిలో ఆయన పాల్గొని పాటలు పాడి శ్రోతలను రంజింప చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నాగేశ్వరరావు ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, సింగవరపు సత్యనారాయణ, గీడుతూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఏలేరు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. మండలంలోని ఇర్రిపాక గ్రామంలోకి ఏలేరు వరద నీరు రాకుండా గట్లు వేయించారు. సోమవారం తహశీల్దార్, ఎంపిడిఒ, సిఐలతో కలిసి ఎప్పటికప్పుడు దిగువ ప్రాంతాల పరిస్థితిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఏలేరు పరివాహక ప్రాంతాల్లో ఉన్న సోమవారం, కృష్ణవరం, ఎస్.తిమ్మాపురం, శృంగారాయునిపాలెం, రాజుపాలెం, రామకృష్ణాపురం, వీరవరం తదితర గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

పంపాకు వరద నీరు

ప్రజాశక్తి - శంఖవరం

తుపాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పంపా రిజర్వాయర్‌లోకి వరద నీరు భారీగా చేరుతోంది. క్రమంగా రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుత నీటిమట్టం 99 అడుగులకు చేరుకుంది. మరో 5 అడుగులు నీటిమట్టం పెరిగితే రిజర్వాయర్ సామర్ధ్యానికి చేరుకుంటుంది. దీంతో పంపా కెనాల్ నుంచి ఒక గేట్ ద్వారా దిగువకు 2 వేల నుంచి 2,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ డిఇ సురేష్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

వరద ప్రభావిత గ్రామాలకు పవన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోటనందూరు

సర్పంచులకు చెక్కును అందిస్తున్న కూటమి నాయకులు

వరద ప్రభావిత గ్రామాలకు డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ప్రకటించిన ఆర్థిక సాయాన్ని సోమవారం తుని సాయి వేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో అందించారు. కోటనందూరు, తుని,తుని రూరల్, తొండంగి మండలాల్లో ఏడు గ్రామ పంచాయతీలు వరద ప్రభావిత గ్రామాలుగా గుర్తించి ఒక్కో గ్రామానికి రూ.1 లక్ష చొప్పున మండల సభాపక్ష నేత యనమల రామకృష్ణుడు, ఎంఎల్ఎ పంతం నానాజీ, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబులతో కలిసి సర్పంచులకు అందజేశారు. ఈ కార్యక్రమంలోకూటమి నేతలు తోట నగేష్, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి పాల్గొన్నారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

రాష్ట్రాన్ని చుట్టిముట్టిన వరదలను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రామవరం శివారు రంగవల్లి నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు, తుపాన్ల కారణంగా లక్షలాది ప్రజలు తిండి లేక విలవిల్లాడుతున్నారన్నారు. చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురి కావడం వల్లే ఈ పరిణామాలకు కారణమని చెబుతున్నా ఆక్రమణలపై ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదన్నారు. తెలంగాణాలో తీసుకొచ్చిన హైడ్రా మాదిరిగా ఎపిలోనూ కొత్త వ్యవస్థను తీసుకొచ్చి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, సతీష్‌పాల్గొన్నారు.

పొలాలను సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట

రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

మండలంలోని పవర, అచ్చంపేట గ్రామాల పరిధిలో నీట మునిగిన వరి పంట పొలాలను పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.సీతారామశర్మ, మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య పర్యటించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సీతారామ శర్మ మాట్లాడుతూ ఎక్కడైతే నీటిని పొలాల నుంచి బయటకు తీయడానికి వీలవుతుందో అక్కడ నీటిని తీసివేసి, వరి కాండం కొంచెం దృఢంగా ఉంది అనుకున్నప్పుడు ఎకరానికి 20 కేజీల యూరియ, 20 కేజీల పొటాష్ ఎరువులను వినియోగించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న జడ్‌పిటిసి

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ సాయమందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జార్జిపేటకు చెందిన ఇంధన సూర్యనారాయణ పెంకుటిల్లు దగ్ధం అయింది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న జడ్‌పిటిసి సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు రైస్ మిల్ వర్కర్స్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న కార్మికులు

విజయవాడ వరద బాధితులకు యానాం రైస్ మిల్ వర్కర్స్ ఆర్థిక సాయాన్ని అందించారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం సిఐటియు కన్వీనర్ కె.సత్యనారాయణ, ఇళ్ల వాసు లకు కార్మికులు రూ.3 వేలు నగదును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా విజయవాడలో ప్రజలు ముంపునకు గురై అనేక ఇబ్బంది గురవుతున్నారని అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు కార్మికులు ఆర్థిక సాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సబ్బతి రాంబాబు, తిరుకోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, సలాది నాగబాబు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం కాండ్రకోట నూకాలమ్మ ఆలయ హుండీలను సోమవారం లెక్కించగా రూ.7,65,921 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి టివి.సూర్యనారాయణ తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌కుమార్‌బాబునాయుడు సమక్షంలో 93 రోజులకు సంబంధించిన హుండీలను తెరిచి లెక్కింపు జరిపారన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో ఏలేరు కాలువ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన పి.నాయకంపల్లి, కె.నాయకంపల్లి, పి.సూరంపాలెం, యర్రంపాలెం గ్రామాలను ఎంపిడిఒ బిఎస్‌కె.రామన్, తహశీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. గ్రామ స్థాయి అధికారులందరూ అప్రమత్తం గా ఉండాలని సూచించారు, ఎప్పటికప్పుడు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

కృష్ణుని ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పాత బస్టాండ్ కృష్ణుని ఆలయం వద్ద సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లు నాగేశ్వరరావు, ఖండవల్లి శ్రీనివాసరావు, నేతి సూర్యకుమారి, ఖండవిల్లి సత్య, ఐలు గోవిందు, నెల్లిపూడి శ్రీకాంత్, అల్లు ప్రసాద్, ఖండవిల్లి సత్య పాల్గొన్నారు.

ఎసిగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా టికె.సుధాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శిగా పని చేశారు. నగర పాలక సంస్థలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నగర అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

పునరావస కేంద్రాలకు తరలింపు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

నాగులపల్లి గ్రామానికి చెందిన సుమారు 200 మంది కుటుంబాలకు చెందిన 600 మంది జనాభాను పునరావస కేంద్రానికి తరలించినట్లు కొత్తపల్లి ఎంపిడిఒ నారాయణరావు సోమవారం రాత్రి తెలిపారు. నాగులపల్లి, రమణక్కపేట గ్రామాలకు సంబంధించి వరద ఉధృతి ఎక్కువైతే రాకపోకల కోసం బోట్లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కిర్లంపూడి

ఏలేరు వరద బాధిత గ్రామాలను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పర్యటించారు. కష్టసుఖాలను తెలుసుకున్నారు. వెంటనే పురావాస కేంద్రాలకు చేరుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ రాత్రికి మరింత వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే రాజుపాలెం గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

వెల్లుల్లి కిలో రూ. 400

పెరుగుతున్న ధరలతో వినియోగదారుల అవస్థ

ప్రజాశక్తి-రామచంద్రపురం

నిత్యవసర సరుకులు రోజురోజుకు పెరుగుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయి. తాజాగా వెల్లులి ధర సామాన్యుల కంట కన్నీరు పెట్టిస్తుంది. గత వారం వరకు రూ.200 ఉన్న ధర అమాంతం ఒకేసారి రూ.400కు చేరింది. దీంతో వెల్లుల్లిపాయలు కొనేందుకు ఎవరు సాహసించడం లేదు. భారతదేశంలో వెల్లుల్లిపాయలు ఉత్పత్తి ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది కాగా మొదటి స్థానం చైనా ఆక్రమించుకుంది. ఇక దేశంలో వెల్లుల్లి ఉత్పత్తి మధ్యప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉండగా రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ లో రెండు మూడు స్థానాల్లో వెల్లుల్లి ఉత్పత్తి చేస్తున్నాయి ఇక ఆంధ్రప్రదేశ్లో ఉత్పత్తి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెల్లుల్లి పంట దిగుబడి తగ్గిపోయి ధరలు విపరీతంగా పెరిగాయి. ఒకవైపు వెల్లుల్లి ధరలు దూసుకుపోతుంట మరోవైపు ఉల్లి ధరలు తగ్గను అంటున్నాయి. రెండు వారాలుగా ఉల్లి ధర రూ.50 వరకు పెరగడంతో సామాన్యులు బెంబెలెత్తుతున్నారు. వీటితోపాటు పప్పుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. గతంలో రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు ఉల్లిపాయలు సైతం ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందజేసేది ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం ఇచ్చిపోవడంతో బహిరంగ మార్కెట్లో ధరలు రోజురోజుకు పెరిగి వ్యాపారులు ఇస్తాను సార్ రేట్లు పెంచుతున్నారు ధరలు అదుపుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంట నష్ట పరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



వ్యవసాయాధికారి కుమార్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

భారీ వర్షాల కారణంగా తొలకరి పంట నష్టపోయామని ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని ఉప్పలగుప్తం, వానపల్లిపాలెంకు చెందిన రైతులు సోమవారం మండల వ్యవసాయ అధికారి జి.కుమార్ బాబుకు వినతి పత్రాల అందజేశారు.ఈ రెండు గ్రామాల్లో వరి చేలల్లోని ముంపు నీరు దిగక వేసిన నారుమడులు ముంపు నీటికి కుళ్లిపోయాయ చేలల్లో నీరు దిగక ప్రకృతి సహకరించక నాట్లు వేయలేదన్నారు. తొలకరి పంట నష్టపోయిన తమకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు చిక్కం పెద్దబ్బులు, జొన్నగంటి రామకృష్ణారావు తదితరులు విన్నవించారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయకర్ పిలుపునిచ్చారు. ఎస్‌కెవిటి ఉన్నత పాఠశాలలో జరిగిన యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ ఒక ప్రహసనంగా మారిందని, మొత్తం ప్రక్రియ రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో కేంద్రీకృతం చేసి ఆన్‌లైన్ చేయడం ద్వారా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలిపారు. పని సర్దుబాటు ప్రక్రియ ద్వారా పాఠశాలల్లో, ఉపాధ్యాయుల్లో కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు.

సమావేశానికి హాజరైన ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉత్తమ బోధనా పద్ధతులను అందిపుచ్చుకుని విద్య బోధన చేయడమే కాక, ఆలోచనసీలురుగా, సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా, దేశ స్థితిగతులను మార్చే విద్యార్థులను తయారు చేసేలా ఉండాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ సర్దుబాటు ప్రక్రియలో ఉన్న అసంబద్ధాలను తొలగించడానికి, సవరించాలని రాష్ట్ర నాయకత్వం అధికారులను కోరిందన్నారు. ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ సర్దుబాటు అపసవ్యతలను వెంటనే తొలగించడానికి ప్రభుత్వం కషి చేయాలని, ఉపాధ్యాయ సంఘాల నాయకత్వాలుతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగోన్నతులు చేపట్టాలని, జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యో గోన్నతులు కల్పించాల న్నారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు ఐ. రాంబాబు, ఎం విజయగౌరి, కోశాధికారి ఇవి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు, రమేష్‌బాబు, దయానిది, ఇ.శ్రీమణి, ప్రకాశరావు, ఎం.శ్రీనివాస్, రాజేశ్వరి, అనిత తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు రహదారులు ఛిద్రం

ప్రజాశక్తి-రావులపాలెం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా మండల పరిధి గ్రామాల్లో రోడ్లు ఛిద్రమై బురద మయంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీలు పొంగి ప్రహించడం మూలంగా రోడ్లు మురికి కూపంలా తయారయ్యాయి. కొమరాజులంక, బండ్రేవు పుంత రోడ్డు అధిక వర్షాలు కారణంగా రహదారుల గోతుల్లో వర్షపు నీరు నిలువ ఉండడంతో స్థానికులు, వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

గోతుల్లో నిలిచిన వర్షం నీరు

క్రీడల్లో గెలుపోటములు సహజం

షటిల్ టోర్నమెంట్ ఛాంపియన్లకు బహుమతి ప్రదానోత్సవంలో ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని వాటిని క్రీడాకారులు మనస్ఫూర్తిగా అంగీకరించాలని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ, 78వ సౌత్ జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్-24 కమిటీ చైర్మన్ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక నారాయణపురంలోని ఆర్ఎంసి ఇండోర్ షటిల్ కోర్టులో ఆదివారం ప్రారంభమైన బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. సోమవారం పలు టీముల మధ్య పోటీలు జరగగా విజేతలుగా నిలిచిన టీమ్లకు సోమవారం సాయంత్రం బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ఛాంపియన్లకు ట్రోఫీలు అందించి మెడల్స్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. అందువల్ల క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటూ తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కాగా సోమవారం పలు బందాల మధ్య పోటీ జరగగా పలువురు విజేతలుగా మరి కొందరు రన్నర్లుగా నిలిచారు. వీరిలో ఉమెన్ టీం ఛాంపియన్షిప్లో కర్ణాటక విజేతగా నిలవగా తమిళనాడుగా రన్నర్‌గా నిలిచారు. బాయిస్ టీం ఛాంపియన్షిప్లో కర్ణాటక విజేతగా నిలవగా తమిళనాడు రన్నర్‌గా నిలిచారు. గర్ల్స్ టీం ఛాంపియన్షిప్ లో తమిళనాడు విన్నర్ కాగా తెలంగాణ రన్నర్‌గా నిలిచారు. ఛాంపియన్లకు ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఎస్.మురళీధరన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక సెక్రటరీ పి.రాజేష్, ఆంధ్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ అంకమ్మ చౌదరి, కమిటీ సభ్యులు అత్తి సత్యనారాయణ, బాలసుబ్రమణ్యం తదితరులు ట్రోఫీలను అందచేశారు.

మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
O.S.No.101 / 2022
సిండికేట్ ఫైనాన్సు చిట్స్, పెద్దాపురం, రిప్రజెంటేడ్ బై మేనేజింగ్ పార్టనర్ శ్రీ చావలి శ్రీ రామ కృష్ణా, పెద్దాపురం ...వాది
ఆవుగడ్డ శ్రీనివాసరావు వగైరాలు ...ప్రతివాదులు
1. వ ప్రతివాది: ఆవుగడ్డ శ్రీనివాసరావు, S/o. లెట్ చిన్నరావు, పోలీస్ కానిస్టేబుల్ (PC 1150) డో.నెం.7-8-3 కొత్తపేట పెద్దాపురం
పై నెంబరు దావా పరిహారం నిమిత్తం మీ పయిన వాది అనువారు పై కోర్టులో దావా దాఖలు చేసినందున అందుకు ఆక్షేపణలు తెలియచేయుటకు మీరు పై కోర్టు వారి ఎదుట ది.26-09-2024 తేది ఉదయం గం 10-30 ని॥లకు హాజరు కావలెను లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.
చావలి కృష్ణారావు
అడ్వకేట్,ప్లీడరు వీది.
పెద్దాపురం

CHANGE OF NAME
I, SHAIK HABEEBULLA, S/o SHAIK LALSAHEB, Resident at D.No.1-19-3, Islampet, Daravaram Village, Chagallu Mandal, E.G.Dt, A.P-534301. I have changed my name from SHAIK ABEEBULLA SHOW (old Name) to SHAIK HABEEBULLA (New Name). hence forth I am being called SHAIK HABEEBULLA S/o SHAIK LALSAHEB, for all Purpose.

పాస్‌పోర్ట్ పోయినది
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా బొమ్మిరెడ్డిపల్లి వెంకట రవికుమార్, తండ్రి: రామశేషు, డి.నెం.7-151, జగన్నాధపురం రోడ్, నల్లజర్ల, తూ.గో.జిల్లా అను నేను నల్లజర్ల బస్‌స్టాండ్ దగ్గరలో నా పాస్‌పోర్ట్ పోగొట్టుకొన్నాను. నా పాస్‌పోర్ట్ నెం.G0612046, ఎవరికైనా దొరికినచో నాకు అందచేయవలెను. కాంటాక్ట్ సెల్ : 99482 45666.

బహిరంగ ప్రకటన
నా క్లయింట్ అనపర్తి గ్రామం బాపనమ్మ గుడివీధి తూర్పుగోదావరి జిల్లా కాపురస్తులు పోతబత్తుల మాతయ్య గారి కుమారుడు రవి గారి యొక్క సంజాయిషీపై తెలియజేయునది వారు గుంటూరు డివిజన్ మంగళగిరి సబ్‌డివిజన్ తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామ పంచాయితీ చేరియున్న సర్వేనెం.68/1 దాఖల సన్‌రైజ్ టవర్స్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం.5 3వ ఫ్లోర్ చ.గ.1140 గల ఫ్లాట్ క్రయ దస్తావేజు యొక్క లింకు దస్తావేజు డాక్యుమెంట్ నెం.5710/2018 ఇతర దస్తావేజుల ద్వారా పొందివున్నారు. సదరు ఒరిజినల్ దస్తావేజు 5.9.2024 సాయంత్రం సుమారు 5 గం॥ల సమయంలో జిరాక్స్ నిమిత్తం తీసుకువెళ్తున్న సమయంలో అనపర్తి గ్రామపంచాయితీ బోర్డ్ సమీపంలో పోయినవి. ఎవరికైన దొరికిన యెడల నాకు తెలియపరచగలరు. ఎవరైనను సదరు ఆస్థితో వ్యవహారములు చేసిన యెడల అవి చెల్లవు.
ఎ.వి.ఎస్.సూర్యారావు
అనపర్తి అడ్వకేట్, అనపర్తి.
తేది.10.9.2024 సెల్: 98482 93656

మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు : పిఠాపురంలో
A.S.No.18/2023
Between
బుద్ధరాజు సత్యనారాయణరాజు అపిలెంట్
మరియు
బి. సీతారామరాజు & అదర్స్ రెస్పాండెంట్స్
టు
5వ రెస్పాండెంట్
ప్రెసిడెంట్ వాటర్ యూసర్స్ అసోసియేషన్, కొత్త చెరువు, దుర్గాడ గ్రామం, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా, పిఠాపురం జూనియర్ సివిల్ జడ్జికోర్టు పరిధి
పై అపీలులో అపిలెంట్ మీ మీద దాఖలు చేసుకున్న అప్పీలులో మీరు 5వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మీకు శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయునందున శ్రీ కోర్టు వారి ఆదేశం ప్రకారం మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు గల అపీలు ది.17-9-2024న వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజు ఉదయం గం. 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల పై అపీలు మీకు పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(ఇది శ్రీకోర్టువారి ఆర్డరు ప్రకారం జారీ చేయబడిన నోటీసు)
Pithapuram 7-9-2024
P.V.S.R. MURTHY, Advocate, D.No.4-2-133, Kuchivari Street, Pithapuram, Ph: 9849765899